క్లుప్తంగా

నేడు 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

సోమందేపల్లి: మండలంలోని మేకలపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

అడవికి నిప్పు



అటవీ ప్రాంతంలో కమ్ముకున్న పొగ

పెనుకొండ: పెనుకొండ అడవికి గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నిప్పుపెట్టారు. ఉదయం 7 గంటల సమయంలో స్థానిక యోగా నరసింహస్వామి ఆలయం ఎదురుగా అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. బోధగడ్డి ఎక్కువగా ఉండటంతో పచ్చని చెట్లు కాలిపోయాయి. పులేకమ్మ గుడి వెనుక ప్రాంతం, పెనుకొండ కొండవైపు మంటలు ఎగిసిపడ్డాయి. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో అధికారులు, ప్రజలు మంటలను ఆర్పే సాహసం చేయలేకపోయారు. అడవికి నిప్పు పెట్టడంతో పలువురు విచారం వ్యక్తం చేశారు.

పరామర్శ



గోవిందరాజులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని కరికెర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు గోవిందరాజులు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం గోవిందరాజులు మృతదేహాన్ని కరికెర గ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి, మాజీ మంత్రి నర్సేగౌడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ జయరామప్ప, మండల కన్వీనర్ ఈఎల్ యంజారే గౌడు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోవిందరాజులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ఎంతో కృషి చేశారన్నారు. పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భూతరాజు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ జయరామప్ప, మాజీ జెడ్పీటీసీ, మార్కెట్‌యార్డు డైరెక్టర్ శివన్న, వక్కలిగ మాజీ డైరెక్టర్ నాగన్న, సర్పంచులు గౌరమ్మ శివన్న, రంగనాథ్ పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న 'ఫుడ్ ఫెస్ట్'



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

పావగడ: స్థానిక ప్రభుత్వ ఆదర్శ విద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్ట్ అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థినులు కాసేపు తమ పెన్నులు, పుస్తకాలను పక్కన పెట్టి గరిట, పాత్రలు చేత పట్టుకుని వంటలక్కల అవతారమెత్తారు. అధికంగా మిల్లెట్స్ వంటలు చేసేందుకు మొగ్గు చూపారు. చదువులోనే కాకుండా వంటల్లోనూ తమ ప్రతిభను చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. విద్యార్థినులు ప్రదర్శించిన రుచికరమైన వంటకాలు నోరూరించాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్‌డీఎంసీ పదాధికారులు వంటలను ఆరగించారు.

వాల్మీకి జాతర ప్రారంభం



మాట్లాడుతున్న ప్రసన్నానంద స్వామిజీ

పావగడ: దావణగెరె జిల్లా హరిహర తాలూకా రాజనహళ్లి మహర్షి వాల్మీకి గురుపీఠంలో 27వ మహర్షి వాల్మీకి జాతర శనివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే జాతరలో భాగంగా మొదటి రోజు బుడకట్టు మహిళల గోష్ఠి, వాల్మీకి ఉద్యోగుల గోష్ఠి, న్యాయవాదుల చర్చా గోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గురు పీఠాధిపతి వాల్మీకి ప్రసన్నానంద స్వామిజీ పాల్గొన్నారు.

సేంద్రియం.. లాభదాయకం

- అధిక దిగుబడి ఇస్తున్న సేంద్రియ ఎరువులు
- ఒకసారి వేసుకుంటే మూడు పంటల వరకూ దిగుబడి
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు



పశువుల ఎరువును కుప్పగా వేసిన రైతులు



దానిమ్మ మొక్కల చుట్టూ పశువుల ఎరువు వేసిన దృశ్యం

రొళ్ల: మడకశిర నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఈ నియోజకవర్గంలో ఏ విధమైన జలాశయాలు, నదులు, రిజర్వాయర్లు లేవు. కేవలం బోరుబావుల్లో వచ్చే నీటితోనే రైతులు వివిధ రకాల ఆరుతడి, వాణిజ్య పంటలను పండిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. కొంత కాలంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోయింది. పంటలు, పైర్లకు చీడపీడలు సోకి దిగుబడులు తగ్గిపోవడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. రసాయనిక ఎరువుల వాడకంలో కలుగుతున్న అనర్థాలను గుర్తించి భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురంతో పాటు మడకశిర మండలాల్లో సేంద్రియ ఎరువులైన పశువుల పేడ, కోడిపెంట, చీకిన గడ్డితో పాటు చెరువులు, కుంటల్లోని సారవంతమైన పూడిక మట్టిని పొలాలకు తరలిస్తున్నారు. బోరుబావుల్లో నీటి ఉండటంతో మెట్ట, మాగాణి భూముల్లో వేరుశనగ, వరి, రాగి, మిరప, గుమ్మడికాయలు, కీరకాయల సాగుతో పాటు పూలతోటలు, కూరగాయల పంట సాగు, దానిమ్మ, అరటి, బొప్పాయ పంటలను అత్యధికంగా సాగు చేస్తున్నారు. పంటల సాగు కోసం పొలంలో దుక్కుల్లో ఈ సేంద్రియ ఎరువులను పొలాల్లో వేసి కలియదున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి సారవంతంగా మారి మంచి ఫలితాలను ఇస్తాయని రైతులు చెబుతున్నారు.

ఎరువులు నిల్వ చేసుకునే విధానం..

ప్రాథమికంగా పంట సాగులో పశువుల ఎరువు వేయకపోతే ఆ ప్రభావం దిగుబడిపై తప్పక చూపిస్తుంది. అందుకోసం పశువుల ఎరువు పంటకు సంజీవని వంటిదని పూర్వీకులు చెబుతున్నారు. పశువుల పేడను గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎక్కడబడితే అక్కడ వేస్తుంటారు. అలా చేస్తే ఏమాత్రం ఉపయోగం ఉండదు. పశువుల పేడను దిబ్బతోగాని, భూమిపై గాని ఒకే చోట కుప్పగా వేయవద్దు. పశువుల మూత్రాన్ని పీల్చే నిమిత్తం సాయంత్రం పూట పశువుల కాళ్ల కింద చెత్త, గడ్డి అవసరమైన మేరకు పరచాలి. ఆ చెత్త మీద మూత్రం, పేడ పడతాయి. ఆ మరుసటి రోజు ఉదయాన్నే ఆ చెత్తను సేకరించాలి. గుంతల్లో సమానంగా పరచుకుంటూ రావాలి.

నియోజకవర్గంలో పంటల సాగు ఇలా..		
మండలం పేరు	రైతుల సంఖ్య	సాగవుతున్న పంటల విస్తీర్ణం
అగళి	5,407	12,383
అమరాపురం	5,923	15,375
రొళ్ల	7,248	15,299
మడకశిర	7,544	15,730
గుడిబండ	9,136	18,161

పొలాల్లో ఇలా చల్లాలి..

రైతులు పశువుల పేడను పొలాల్లో మండెలుగా కట్టాలి. ముందుగా మట్టిని అర అడుగు మందంతో గుండ్రంగా వేయాలి. దానిపై అడుగున్నర మందంతో పశువుల పేడును పరచాలి. దానిపై మట్టి, మళ్లీ పశువుల పేడను ఇలా రెండు మూడు వరసలు వేసిన తర్వాత పైన మట్టితో కప్పి ఉంచితే బాగా మగ్గుతుంది. ఇలా నెల రోజుల పాటు అలాగే ఉంచిన తర్వాత పొలంలో కుప్పలుగా పోసి వెంటనే చల్లాలి. అలా చల్లకపోతే పశువుల ఎరువులో ఉండే పోషకాలు నశిస్తాయి. దీనివల్ల ఎరువు వేసిన కూడా ఏమాత్రం ఉపయోగం ఉండదు.

భూసారం పెరుగుతుంది..



వక్క, పత్తి, వేరుశనగ ఇతరాత్ర పంటల సాగులో ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వాడుతున్నాం. రసాయన ఎరువులతో పోలిస్తే సేంద్రియ ఎరువులతో భూసారం పెరుగుతుంది. భూమి దుక్కులకు ముందే సేంద్రియ ఎరువులను పొలంలో కలియదున్నితే మంచి ఫలితాలు ఉంటాయి. యూరియా, కాంప్లెక్స్, పొటాష్ వంటి రసాయనిక ఎరువులు వేసుకోవాల్సిన అవసరం ఉండదు.

– మంజునాథ్, బీజీ హళ్లి గ్రామం

ప్రయోజనాలు అధికం



పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడితే చాలా ప్రయోజనాలు ఉన్నాయి. పశువుల పేడ, పూడిక మట్టిని వేస్తే భూమిలో తేమ శాతం మరింత పెరుగుతుంది. పంటలు త్వరగా ఎండిపోవు. సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో చీడపీడలు, తెగుళ్ల కూడా తక్కువగా ఉంటాయి. పంటల దిగుబడి కూడా పెరుగుతుంది. రైతులు ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులను భూమిలో కలియదున్నాలి.

– క్రిష్ణమీనన్, వ్యవసాయశాఖ ఏడీఏ, మడకశిర డివిజన్

బీజేపీ విజయోత్సవాలు

మడకశిర: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా నాయకుడు పురుషోత్తం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన తర్వాత టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుదాస్, శివకుమార్, సుబ్బరాయుడు, నాగరాజు, జయరాం, అరవింద్, సుబ్రాయప్ప, గోవిందప్ప, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు అనిల్ కుమార్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవడంతో శనివారం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాలరావు, మండల కన్వీనర్ ఎస్ఎల్ మూర్తి, ఎంపీటీసీ చంద్రశేఖర రెడ్డి పాల్గొన్నారు.

గోరంట్ల: ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బోయ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బస్టాండ్ సర్కిల్ వద్ద బాణాసంచా పేల్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొట్టు శ్రీనివాసులు, శంకరరెడ్డి, ముతాజమ్మ, నాగరాజు, జగన్‌మోహన్, వడల చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

హిందూపురం టౌన్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవడంతో నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షురాలు, 11వ వార్డు కౌన్సిలర్ అంజలి అధ్యక్షతన అంబేడ్కర్ సర్కిల్‌లో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు మేడుకుర్తి హరి పాల్గొన్నారు.

కృష్ణా జలాలు విడుదల చేయరా?

మడకశిర: నియోజకవర్గంలోని అన్ని చెరువులకు కృష్ణా జలాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇంత వరకూ మడకశిర నియోజకవర్గానికి కృష్ణా జలాలను విడుదల చేయలేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో మడకశిర నియోజకవర్గానికి కృష్ణా జలాలు వచ్చాయని గుర్తుచేశారు. మడకశిర చెరువును కృష్ణా జలాలతో రెండు సార్లు నింపిన ఘనత కూడా వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రొళ్ల, అగళి మండలాలకు కూడా కృష్ణా జలాలు అందించాలని కోరారు. హంద్రీ–నీవా ఉప కాలువల నిర్మాణం పూర్తి చేసి, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు అందించాలని తెలిపారు. వైఎస్ జగన్ హయాంలో రూ.214.85 కోట్లతో మంజూరైన మడకశిర బైపాస్ కెనాల్ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ హయాంలోనే ఈ పనులకు టెండర్లను కూడా పూర్తి చేశారని పేర్కొన్నారు. కృష్ణా జలాలు అందించి నియోజకవర్గంలోని రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా హారతుల ఉత్సవం

అమరాపురం: మండల పరిధిలోని గౌడనకుంటలో శనివారం ఆంజనేయ స్వామికి హారతుల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆంజనేయ స్వామికి అర్చకులు వివిధ రకాల అభిషేకాలు చేశారు. భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం మహిళలు పిండితో తయారు చేసిన కలశాలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని స్వామికి హారతులను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదం అందజేశారు.



హారతులను తీసుకెళ్తున్న మహిళా భక్తులు

తూకాల్లో మోసం

హిందూపురం టౌన్: పట్టణంలోని పలు ప్రభుత్వ చౌక ధాన్యపు డిపోల్లో బియ్యం తూకాలు సక్రమంగా వేయడం లేదు. లబ్ధిదారులను మోసం చేస్తున్నారని సీపీఐ నాయకులు మండిపడ్డారు. శనివారం పట్టణంలోని పలు చౌకధాన్యపు డిపోల వద్ద బియ్యం తూకాల్లో మోసాలను సీపీఐ నాయకులు గుర్తించారు. సీపీఐ కాలనీలో తూకంలో మోసాలను గమనించిన లబ్ధిదారులు ఎందుకు ఇలా వేస్తున్నారని స్టోర్ డీలర్‌ను ప్రశ్నించారు. సీపీఐ తాలుకా కార్యదర్శి వినోద్ కుమార్ స్పందించి సీఎస్‌డీటీకి సమాచారం ఇచ్చారు. సీఎస్‌డీటీ అక్కడికి చేరుకుని పరిశీలించి, డీలర్‌ను హెచ్చరించారు. ఇలా మరోసారి జరిగితే షాపు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అయితే అక్కడ ఉన్న స్టోర్ డీలర్ బంధువు మాకు కాటాలో తూకాలు తక్కువ వస్తున్నాయి.. ఇలాగే ఎక్కువ స్టోర్లలో జరుగుతున్నాయని చెప్పడంతో అక్కడున్న వారు ఆశ్చర్యానికి గురయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసియా భాను, యాస్మిన్, అనూష, అస్మా, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



స్టోర్ డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

సంక్షిప్త సమాచారం

వక్కతోటకు నిప్పు



మంటలను అదుపుచేస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని హరిహరపురం గ్రామంలో రైతు వెంకటప్పకు చెందిన వక్కతోటకు నిప్పు అంటుకోవడంతో 200 వక్కచెట్లు, 50 కొబ్బరి చెట్లు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక అగ్నిమాపక దళం సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు వెంకటప్ప ప్రభుత్వాన్ని కోరారు. అరసికెరెలో రైతు బీకే మునిస్వామి వక్కతోట అగ్నికి ఆహుతైన సంఘటన మరువక ముందే హరిహరపురంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.

ఘనంగా షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం

రొద్దం: మండల పరిధిలోని ఆర్.మరువపల్లి పాత చెక్ పోస్ట్ వద్ద ఉన్న సద్గురు షిరిడీ సాయి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే వార్షికోత్సవంలో మొదటి రోజు హోమాలు, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ఆదివారం ఉదయం జ్యోతుల ఉత్సవం, నవగ్రహ శాంతి యజ్ఞం, సద్గురు ప్రవచనాలు, పాదపూజ నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం బాబావారి పల్లకీ సేవ, ఊరేగింపు ఉంటుందని వివరించారు.

ఘనంగా రంగనాథస్వామి ఉత్సవాలు





అలంకరణలో రంగనాథస్వామి, శనేశ్వరస్వామి

మడకశిర రూరల్: మండల పరిధిలోని టీడీపల్లి సమీపంలోని కొండపై వెలిసిన రంగనాథ స్వామి, శనేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా శనివారం మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. రంగనాథ స్వామి ఆలయంలో అర్చకులు గంగపూజ, అభిషేకం, నవగ్రహపూజ తదితర పూజలు చేపట్టారు. భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రసాద వినియోగం చేశారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

రొళ్ల: మామిడి పూతదశలో ఉన్నప్పుడు యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని ఎంపీహెచ్‌ఏ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తూభినకుంట, ఆవినకుంట తదితర గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించారు. మొగ్గ దశలో మామిడికి తేనె మంచు పురుగు, మిడ్డి పురుగు, పేనుబంక, బూడిద తెగులు ఆశించి నష్టం కలిగిస్తాయని తెలిపారు. ఇందు కోసం ఇమిడాక్లోప్రిడ్ లీటర్ నీటికి 0.5 ఎంఎల్ లేదా బూప్రొపెజిన్ లీటర్ నీటికి 2 ఎంఎల్ మందుల్లో ఒకదానితో పాటు నీటిలో కరిగే గంధకం (సల్ఫెక్స్ లీటర్ నీటికి 3గ్రాం) కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

మద్యం షాపునకు ఒకే దరఖాస్తు

పెనుకొండ రూరల్: పెనుకొండ నగర పంచాయతీ వెలుపల మద్యం షాపు కోసం ఒకే దరఖాస్తు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్ బాబు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం రిజర్వుడ్ కేటగిరీ (ఈడిగ సామాజిక వర్గానికి) మద్యం షాపునకు టెండర్ ప్రక్రియ ద్వారా దరఖాస్తులను ఆహ్వానించింది. జనవరి 27వ తేదీన టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 8 రాత్రి 9 గంటలకు దరఖాస్తు గడువు ముగిసింది.

ఉన్నతస్థాయికి ఎదగాలి



సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు

అగళి: మండల కేంద్రంలోని బీసీ హస్టల్‌లో శనివారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ విగ్రహానికి ప్రత్యేకంగా అభిషేకం, పూజలు చేశారు. విద్యార్థులతో సరస్వతీ మంత్రాన్ని పఠించారు. బీసీ హాస్టల్ వార్డెన్ సికిందర్ బాషా మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు.

ఆవుల అపహరణ

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువు, చాలకూరు గ్రామాల్లో రెండు ఆవులు చోరీకి గురైన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఇళ్ల వద్ద కట్టేసిన ఆవులను దుండగులు అపహరించారు. రెండు ఆవుల విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని బాధిత రైతులు కేతగాని చెరువుకు చెందిన కంసల రాము, చాలకూరుకు చెందిన రామచంద్రప్ప తెలిపారు.

నేటి నుంచి భూతరాయ స్వామి ఉత్సవాలు

అమరాపురం: వలస గ్రామంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు భూతరాయ స్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలన్న తెలిపారు. ఆదివారం కర్ణాటకలోని సిరా. పుర, ముగదాళబెట్టలో ఉన్న కరియమ్మ, గౌడచంద్రమ్మ దేవతలను వలస గ్రామానికి తీసుకొస్తామన్నారు. 10న భూతరాయ స్వామి, అమ్మవార్లకు జలధి ఉత్సవం, 11న జ్యోతుల ఉత్సవం, 12న దేవతల తిరిగింపు కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రాణప్రతిష్ట

పరిగి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విగ్రహాలకు ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పార్టీ పటిష్టతకు పాటుపడాలి

పావగడ: పదవులు చేపట్టడమే కాకుండా తాలూకా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పాటుపడాలని మాజీ మంత్రి వెంకటరమణప్ప సూచించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన తాలూకా యువ కాంగ్రెస్ అధ్యక్షుడు సుజిత్, పట్టణ యువ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ కుమార్ శనివారం మాజీ మంత్రి వెంకటరమణప్పను కలిసి, సన్మానించారు. కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షుడు మహేశ్, పళవల్లి శివకుమార్, కృష్ణమూర్తి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి వెంకటరమణప్పను సన్మానిస్తున్న నూతన అధ్యక్షులు

వాహనాల తనిఖీ

అగళి: పి.బ్యాడగేర చెక్‌పోస్ట్ వద్ద శనివారం సాయంత్రం ఎస్ఐ వీరేష్ సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. అనుమతి లేకుండా తిరుగుతున్న వాహనాలు, నంబర్ ప్లేట్ వాహనాల గుర్తించి జరిమానా విధించారు.

కోడి రంగనాథస్వామికి దీపోత్సవం



కలశాలతో ఊరేగింపు చేపట్టిన మహిళలు

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలో కోడి రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం దీపోత్సవం నిర్వహించారు. మహిళలు ప్రతి ఇంటి నుంచి దీపాలను వెలిగించుకుని మెయిన్ రోడ్డులోకి వచ్చారు. అక్కడ నుండి దేవాలయం వరకూ ఊరేగింపుగా వెళ్లి దీపాలను స్వామికి సమర్పించారు. కలశ స్థాపన, అభిషేకాలు, పూజ, హోమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం అనంతరం మహామంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం జరిగిన కల్యాణోత్సవం, ప్రాకారోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కెంచమాంబకు పూజలు



ఆలయానికి దీపాలు వితరణ చేస్తున్న భక్తులు

అమరాపురం: గౌడనకుంటలో కెంచమాంబ ఉత్సవాల్లో భాగంగా శనివారం కుంకుమార్చన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు తెచ్చిన చీరతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అమరాపురం గ్రామానికి చెందిన డిపో కుటుంబ సభ్యులు ఆలయానికి దీపాలను విరాళంగా అందజేశారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు భోజన వసతి కల్పించారు.

వైభవంగా జలధి ఉత్సవం



భూతప్ప స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రొళ్ల: మండల కేంద్రం గొల్లహట్టిలో వెలసిన భూతప్ప స్వామికి శనివారం జలధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో పట్టణ సమీపంలో ఉన్న రొళ్ల చెరువు వద్దకు తీసుకెళ్లారు. చెరువు గట్టుపై భూతప్ప స్వామి ప్రతిమను కొలువుదీర్చారు. బొరుగుల ప్రసాదాన్ని గోవింద నామస్మరణతో భూతప్పలు భుజించారు. అనంతరం భక్తులకు యాదవ కులస్తులు అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న వంటల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 200 మంది పాల్గొని వివిధ రకాల డ్రైఫ్రూట్స్ వంటలు, పండ్లు, రసాలను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, కరస్పాండెంట్ డీఎస్ నందకుమార్, హెచ్ఎం గాయత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్ల దగ్ధం



కాలిపోతున్న మామిడి చెట్లు

సోమందేపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని నక్కలగుట్ట కాలనీలో యూ.డీ.హుస్సేన్ బీకి చెందిన మామిడి తోటకు శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. 20 మామిడి, జామ, బొప్పాయి చెట్లు దగ్ధమయ్యాయి. మంటలు దట్టంగా వ్యాపించడంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పేశారు. పూత దశలో ఉన్న మామిడి చెట్లు కాలిపోవడంతో నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.